www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 10 డిసెంబర్ 2023 5 ఏలూరు

తక్షణం పంట నష్టపరిహారమందించాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మిచౌంగ్ తుపాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు డిమాండ్ చేశారు. శనివారం ఆగిరిపల్లి సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుపాన్ వల్ల వరి, పత్తి, మినుము, మొక్కజొన్న, పొగాకు పంటలకు తీవ్రనష్టం వాటిల్లిందని, ప్రభుత్వం వెంటనే సంబంధిత శాఖల అధికారులతో పంటనష్టం అంచనాలు వేయించి, రైతులకు పరిహారం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి దాశరి శివనాగరాజు, సభ్యులు సత్తు కోటేశ్వరరావు, గంటా పాపారావు, ఏపూరి రవీంద్ర, షేక్ సుభానీ పాల్గొన్నారు.

ఫిర్యాదుకు పరిష్కారం లేదాయే..!



Spandana Collectorate-Eluru

జిల్లా Eluru మండలము Dwaraka Tirumala

గ్రామ సచివాలయము PANGIDIGUDEM1-(R), 10590830

పరిష్కరించు అధికారి Executive Officer,Panchayat Raj-Dwaraka Tirumala

గడువు 30 Day(s) పరిష్కరించు గడువు తేది 25-10-2023

ఎన్రోల్మెంట్ ఆపరేటర్ ఆపరేటర్-7, జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం, ఏలూరు



Spandana Collectorate-Eluru

జిల్లా Eluru మండలము Dwaraka Tirumala

గ్రామ సచివాలయము PANGIDIGUDEM1-(R), 10590830

పరిష్కరించు అధికారి TAHSILDAR, DWARAKA TIRUMALA

గడువు 7 Day(s) పరిష్కరించు గడువు తేది 04-12-2023

ఎన్రోల్మెంట్ ఆపరేటర్ ఆపరేటర్-6, జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం, ఏలూరు

గమనిక! మీ యొక్క ఫిర్యాదు స్థితి కొరకు 1902 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోను

పంగిడిగూడెంలో ఇంటి సరిహద్దు సమస్యపై రెండుసార్లు స్పందనలో చేసిన ఫిర్యాదులు

'స్పందన' ఫిర్యాదుల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం

రెండు, మూడుసార్లు 'జగనన్నకు చెబుదాం'లో ఇచ్చినా పరిష్కారం నిల్

బాధితునితో నిమిత్తం లేకుండానే ఫిర్యాదు ముగించేస్తున్న అధికారులు

ద్వారకాతిరుమల మండల అధికారుల తీరుపై బాధితుల ఆవేదన

కలెక్టర్ చెప్పినా ఫిర్యాదుపై స్పందించని వైద్య ఆరోగ్య శాఖాధికారులు

పంగిడిగూడెం, వేలేరుపాడు ఘటనలే ప్రత్యక్ష నిదర్శనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'జగనన్నకు చెబుదాం' స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో పలుచోట్ల అధికారుల వ్యవహారశైలి చర్చనీయాంశంగా మారుతోంది. ఫిర్యాదు చేసిన బాధితునితో సంబంధం లేకుండా ఏకపక్షంగా అధికారులు ఫిర్యాదులకు ముగింపు పలికేస్తున్నారు. అందుకు ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం, వేలేరుపాడు మండలంలో ఘటనలే ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. ప్రభుత్వం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రతి సోమవారం జిల్లా, మండల కేంద్రాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమానికి మరింత మెరుగులు దిద్దేందుకు 'జగనన్నకు చెబుదాం'ను ప్రభుత్వం చేపట్టింది. ఈ కార్యక్రమంలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదును గడువులోగా సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో పరిష్కరించంచి, ఫిర్యాదుదారునితో సంతృప్తి చెందినట్లు సంతకం చేయించి ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. అయితే చాలామంది అధికారులు ఫిర్యాదుదారునితో సంబంధం లేకుండా తమకు తోచిన విధంగా సమస్యను ముగిస్తున్నట్లుగా పేర్కొంటున్నారు. మరికొన్ని చోట్ల సమస్యను పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ ఫిర్యాదుదారుల సహనానికి పరీక్ష పెడుతున్నారు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం గ్రామానికి చెందిన వీరవల్లి నాగవెంకట్రావు తమ ఇంటికి సంబంధించి సరిహద్దు సమస్యపై ఈ ఏడాది సెప్టెంబర్ 25న ఏలూరు కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు ఇచ్చారు. దీన్ని మండలంలోని పంచాయతీరాజ్ అధికారులకు పంపిస్తున్నట్లు రశీదు ఇచ్చారు. ఫిర్యాదుదారుని సమక్షంలో సమస్యను పరిష్కరించకుండా వాళ్లకు నచ్చినవాళ్లతో మాట్లాడి సమస్యను ముగించేసినట్లు బాధితులు చెబుతున్నారు. తర్వాత స్పందన కాల్‌సెంటర్ నుంచి ఫోన్‌రాగా తమసమస్య పరిష్కారం కాలేదని, ఫిర్యాదును రీఓపెన్ చేయాలని ఫిర్యాదుదారుడు కోరారు. ఫిర్యాదు రీఓపెన్ చేసినా అదే పరిస్థితి కొనసాగింది. మండలంలోని అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో నవంబర్ 27న ఏలూరు స్పందన కార్యక్రమంలో మరోసారి ఫిర్యాదు ఇచ్చారు. స్థానిక అధికారులు వచ్చి సమస్యను పరిష్కరించకుండానే ఫిర్యాదుదారున్ని సంతకం పెట్టాలని కోరారు. ఫిర్యాదుదారుడు ఒప్పుకోకపోవడంతో అధికారులు తమకు నచ్చిన విధంగా ఫిర్యాదును ముగించేసిన పరిస్థితి నెలకొంది. ఫిర్యాదుపై బాధితుని సమక్షంలో ఇంటి స్థలం సర్వే నిర్వహించడంగాని, కొత్త దస్తావేజుల్లో ఏమైనా తేడాలు ఉంటే లింక్‌డాక్యుమెంట్ పరిశీలించి చర్యలు చేపట్టడంగానీ ఏఒక్కటీ చేయలేదని ఫిర్యాదుదారుడు నాగవెంకట్రావు కుటుంబం ఆవేదన చెందుతోంది. ఎన్నిసార్లు స్పందనలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. లింకు డాక్యుమెంట్ ప్రకారం సర్వే చేసి తన ఇంటి స్థలం సరిహద్దుల సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదుదారుడు కోరుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుంటే తప్ప ఫిర్యాదుదారునికి న్యాయం జరిగే పరిస్థితి కన్పించడం లేదు.

కలెక్టర్ చెప్పినా చర్యలు నిల్

వేలేరుపాడు మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా కొంతమంది ప్రయివేటు ఆసుపత్రులు (క్లినిక్‌లు) నడుపుతున్నారని, అర్హత లేకుండా వైద్యం చేయడంతో రోగులకు తీవ్రనష్టం జరుగుతుందని రుద్రమ్మకోట గ్రామానికి చెందిన కొక్కిరిపాటి రవీంద్ర ఈ ఏడాది అక్టోబర్ తొమ్మిదో తేదీన ఏలూరు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. అనుమతులు లేకుండా నడిపిన క్లినిక్‌ను గతంలో అధికారులు మూసివేశారని, అదే క్లినిక్‌ను మళ్లీ తెరిచి నడుపుతున్నారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ నిర్వహించి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్వయంగా వైద్యఆరోగ్య శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకూ అనుమతులు లేకుండా నడుపుతున్న క్లినిక్‌లపై వైద్యఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో నవంబర్ 20న, మళ్లీ డిసెంబర్ నాలుగో తేదీన ఇప్పటి వరకూ స్పందనలో మూడుసార్లు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించినా వైద్యఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడం ఫిర్యాదుదారుడిని నిర్ఘాంతపరుస్తోంది. అర్హత లేని వైద్యులు వైద్యం చేస్తే రోగుల ప్రాణాలకు ప్రమాదం ఉన్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. అదిగో.. ఇదిగో అనడం మినహా చర్యలు తీసుకోకపోవడంపై ఫిర్యాదుదారుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. జిల్లా ఉన్నతాధికారి దృష్టిసారిస్తే తప్ప సమస్య పరిష్కారమయ్యే పరిస్థితి కన్పించడం లేదు. స్పందనకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో జనాల్లో నమ్మకం సడలిపోతున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంపై జనాల్లో అసంతృప్తి పెరగడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే పరిస్థితి ఉంది.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు

ఓపిఎస్ ఊసెత్తని జగన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యం తగదు

నాలుగున్నరేళ్లలో ఒక్క డిఎస్‌సి కూడా ప్రకటించని పరిస్థితి

రూ.20 వేల కోట్ల ఆర్థిక బకాయిల సాధనకు కార్యాచరణ

ప్రాథమిక విద్యను కాపాడుకోవాలి

తిరోగమనం వైపు విద్యారంగం సంస్కరణలు

యుటిఎఫ్ రాష్ట్రకౌన్సిల్ సమావేశాల ప్రారంభంలో నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామన్న సిఎం జగన్ ఉద్యోగ, ఉపాధ్యాయులను ఘోరంగా మోసగించారని, నేడు ఆ ఊసెత్తడం లేదని ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణల పేరుతో విద్యారంగాన్ని తిరోగమనంవైపు తీసుకెళ్తుందని, ప్రాథమిక విద్యను బతికించుకునేందుకు ఉపాధ్యాయులు కదలి తల్లిదండ్రులతో కలిసి సామాజిక ఉద్యమాన్ని నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర 49వ కౌన్సిల్ సమావేశాలు శనివారం స్థానిక మినీ బైపాస్‌రోడ్‌లోని చలసాని గార్డెన్స్‌లో ప్రారంభమయ్యాయి. ముందుగా స్థానిక కెనాల్ రోడ్‌లోని యుటిఎఫ్ కార్యాలయం వద్ద ర్యాలీని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ర్యాలీ మున్సిపల్ కార్యాలయం, పాతబస్టాండ్, వసంతమహల్ సెంటర్, ఓవర్ బ్రిడ్జి, కొత్తబస్టాండ్, సత్రంపాడు మీదుగా చలసాని గార్డెన్స్ చేరుకుంది. అనంతరం సభా ప్రాంగణంలో స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జెండాను సాబ్జీ, యుటిఎఫ్ జెండాను యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు, జాతీయ జెండాను పూర్వపు రాష్ట్ర కార్యదర్శి జయప్రభ ఆవిష్కరించారు. అనంతరం యుటిఎఫ్ అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన ప్రారంభ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో రిటర్న్ గిఫ్ట్ ఇస్తామన్నారు. అనంతరం ఎంఎల్‌సి లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల నియామకాలకు ఒక డిఎస్‌సి కూడా విడుదల చేయని ప్రభుత్వం ఈ వైసిపి అని అన్నారు. అధికారంలోకొచ్చిథన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేస్తానన్న సిఎం జగన్ మాట తప్పి జిపిఎస్ ప్రకటించడం సరికాదన్నారు. 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే వాటిని భర్తీ చేయకుండా నాణ్యమైన విద్య ఎలా సాధ్యమో చెప్పాలన్నారు. పాఠశాలల విలీన ప్రక్రియ ద్వారా విద్యారంగం తీవ్రంగా నష్టపోతుందని, విద్య చుట్టూ సామాజిక ఉద్యమాలు నిర్మించడం ద్వారానే విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ కౌన్సిల్లో చర్చించే అంశాలు సమావేశానికి తెలియజేస్తూ ప్రభుత్వ పాఠశాలలను బతికించుకోవడానికి యుటిఎఫ్ బహుముఖ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ అంశాన్ని రాజకీయ ఎజెండాగా మార్చనున్నట్లు 'ఓట్ ఫర్ ఓపిఎస్' నినాదంతో విస్తతంగా ప్రజల్లోకి వెళ్తున్నట్లు తెలిపారు. దీర్ఘకాలంగా ఉపాధ్యాయులకు పిఆర్‌సి, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవు బకాయిలు రూ.20 వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ ఆర్థిక బకాయిల సాధనకు కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంఎల్‌సి, యుటిఎఫ్ పూర్వపు రాష్ట్ర అధ్యక్షులు ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యుటిఎఫ్ రాష్ట్రంలో అతిపెద్ద ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించిందన్నారు. 49 సంవత్సరాలు పూర్తిచేసుకుని స్వర్ణోత్సవాలకు సిద్ధమవుతుందని తెలిపారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించకూడదంటూ నిర్బంధాలకు పూనుకుంటున్నారని, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరన్నారు. పాఠశాల విద్యారంగాన్ని ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించని ప్రభుత్వాలు ఏ విధంగా కనుమరుగయ్యాయో చరిత్ర చెబుతుందని విమర్శించారు.

షేక్ సాబ్జీ మాట్లాడుతూ ఎన్‌జిపి-2020 పేరుతో దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా విద్యారంగంలో విధ్వంసాన్ని రాష్ట్ర ప్రభుత్వం సృష్టిస్తుందన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యా వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తూ ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాల్లో విలీనం చేయడంతో వేలాది పాఠశాలలు మూతపడ్డాయన్నారు. మాతృభాష బోధన మాధ్యమంగా లేని విధంగా ఈ రాష్ట్రాన్ని తయారుచేశారన్నారు. ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమం ఉండాలన్నారు. జిల్లా జెఎసి ఛైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు ప్రసంగిస్తూ ఉపాధ్యాయ వృత్తిని కించపరిచే విధంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఒకటో తేదీన జీతాల కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదురుచూసేలా చేయడం ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు. ప్రజలతో కలిసి ఓటు హక్కు ద్వారా ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుదామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ మెరుగైన సమాజం నిర్మించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, పాజిటివ్ థింకింగ్, మానవ విలువలు పెంపొందించాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల తాను సానుకూలంగా ఉంటానని ఉపాధ్యాయులు తనను ఎప్పుడైనా నేరుగా కలవొచ్చని తెలిపారు.

ఈ సమావేశంలో సిఐటియు నాయకులు ఆర్.లింగరాజు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాస్, సహాధ్యక్షులు సురేష్ కుమార్, కోశాధికారి గోపిమూర్తి, రాష్ట్ర కార్యదర్శులు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, ముస్తఫా ఆలీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

హాజరైన ఉపాధ్యాయులు

మాట్లాడుతున్న మురళీ

అవినీతి రహిత సేవలందించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సచివాలయాల్లో అవినీతిరహిత సేవలందించాలని స్టేట్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జె.మురళీ ఆయా ఉద్యోగులకు సూచించారు. మండలంలోని వెలుగు, ఎంపిడిఒ కార్యలయాల, సచివాలయాల సిబ్బందికి, వాలంటీర్లకు జరుగుతున్న శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. సచివాలయాల్లో జరిగే పాలన పారదర్శకంగా ఉండాలని, ప్రజలకు అవినీతి రహిత పాలన అందించాలన్నారు. సిబ్బంది ప్రజాప్రతినిధుల ఒత్తిడికి లోను కాకుండా పని చేయాలని సూచించారు. అదే విధంగా సంక్షేమ పథకాల అమలుకు మరింత కృషి చేయాలన్నారు. అనంతరం సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కృష్ణప్రసాద్, సూపరింటెండెంట్ ఎం.మంగ తాయారు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుకపై ఆంక్షలు దారుణం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ఇసుక సరఫరాపై ఆంక్షలు ఎత్తివేయాలని, నిర్మాణ కార్మికుల ఉపాధిని కాపాడాలని, కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న కలెక్టరేట్ వద్ద చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏలూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు కోరారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఏలూరు కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ సెంటర్లలో శనివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఈ నాలుగున్నర సంవత్సరాల్లో నిర్మాణరంగం సంక్షోభంలో కూరుకపోయిందని, ఇసుక అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం నిలుపుదల చేసిన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వీరంకి సాయిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత భవననిర్మాణ సామగ్రి ధరలు ఆకాశాన్నంటాయన్నారు. జగన్ తండ్రి రాజశేఖర్‌రెడ్డి తీసుకొచ్చిన సంక్షేమ బోర్డుని కొడుకు నిర్వీర్యం చేసి కార్మికులను రోడ్డున పడేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు, మదర్ థెరిస్సా యూనియన్ నాయకులు మాధవ, శ్రీనివాస్, బత్తుల బుజ్జి పాల్గొన్నారు.

తుపాన్ బాధిత రైతులకు అండగా ఉంటాం

జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ప్రజాశక్తి - పెదపాడు

అపరాల విత్తనాలు అందిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ

తుపాన్ వల్ల నష్టపోయిన రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. మండలంలోని సత్యవోలులో తుపాన్‌కు దెబ్బతిన్న పంటలను ఆమె శనివారం పరిశీలించారు. రైతులకు అపరాల పంట వేసుకునేందుకు సబ్సిడీపై పెసర విత్తనాలు ఎకరాకు ఎనిమిది కేజీల చొప్పున అందించారు. పెదపాడు మండలానికి 275 క్వింటాళ్ల అపరాల విత్తనాలు అందించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ అపరాల పంటలు వేసుకునేందుకు పెసలు, మినుము విత్తనాలు ముందుగా అందజేస్తున్నామన్నారు. వరి పంటలను అధికారులు పరిశీలించి నష్టాన్ని నమోదు చేస్తున్నారని, త్వరలోనే ప్రభుత్వం నుండి రైతులకు నష్టపరిహారం అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యవోలు సర్పంచి రంభా ఉమామహేశ్వరి, ఉపసర్పంచి పెంకి శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి ప్రదీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛను రూ.ఆరు వేలకు పెంచాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వికలాంగుల పెన్షన్ రూ.ఆరు వేలకు పెంచాలని, బస్సు, రైల్వే ప్రయాణ సౌకర్యం ఉచితంగా కల్పించాలని, వికలాంగులందరికీ ఇంటి స్థలం ఇచ్చి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా సమావేశం డిమాండ్ చేసింది. ఈ సమావేశం శనివారం స్థానిక ఎన్‌ఆర్‌పేటలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో అల్లాడి నటరాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ సిఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వికలాంగుల పెన్షన్ ఒక్క రూపాయి కూడా పెంచలేదన్నారు. తెలంగాణాలో వచ్చే ఏప్రిల్ నుండి వికలాంగుల పెన్షన్ నెలకు రూ.ఆరు వేలకు పెంచుతున్నారని, అదే మాదిరిగా ఇక్కడ కూడా పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. వికలాంగుల పెన్షన్, వృద్ధాప్య, వితంతు పెన్షన్లు సమానంగా ఉన్నాయని, కానీ వికలాంగులు వారి పనులు వారు చేసుకోలేక ఇతరులపై ఆధారపడే పరిస్థితిల్లో అవయవలోపంతో ఉన్నవారికి పెన్షన్ రెండింతలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వికలాంగులందరికీ రైళ్లల్లో, బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. అల్లాడి నటరాజు మాట్లాడుతూ వికలాంగులకు విద్యా ఉద్యోగాల్లో అన్ని ప్రభుత్వ పథకాల్లో నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా అమలు చేయడం లేదని విమర్శించారు. వందలాది మంది వికలాంగులు సొంతిల్లు లేక అద్దెలు కట్టుకోలేక అనేక అవస్థలు పడుతున్నారన్నారు. జగనన్న కాలనీల్లో నాలుగు శాతం ఇళ్లు వికలాంగులకు ఇవ్వాల్సి ఉందని ఆయన తెలిపారు. ఆర్థిక స్తోమత లేని వికలాంగులకు ప్రభుత్వమే పూర్తి సబ్సిడీతో ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అంత్యోదయ కార్డులిచ్చి నెలకి 35 కేజీల బియ్యం ఇవ్వాలని, స్వయం ఉపాధికి రూ.5 లక్షలు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈనెల 18వ తేదీన ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో వలివేటి హేమలత, జంపన మునియ్య, ఈపిచర్ల నాగరాజు, ఇల్ల నరసింహమూర్తి, టి.పుష్పావతి. బి.హేమ, పాండురంగారావు మాట్లాడారు. బొర్రా పాండురంగారావు, జిల్లా కన్వీనర్‌గా ఐదుగురితో తాత్కాలిక జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

తుపాను నేర్పిన పాఠాలెన్నో..!

మిచౌంగ్ తుపాను ఉమ్మడి జిల్లాను అతలాకుతలం చేసింది. ఈదురుగాలులు, ఎడతెరిపి లేని వర్షం, ఆపై సుడిగాలులు జిల్లావాసులను కష్టాల పాల్జేశాయి. వరి, ఇతర పంటలు నీట మునిగి రైతులు తీవ్ర నష్టాల పాలయ్యారు. సుడిగాలి పెద్దఎత్తున ఆస్తి నష్టాన్ని మిగిల్చింది. సామూహిక కల్లాలు లేక రైతులు పుంతగట్లు, పొలాల్లోనే ధాన్యాన్ని ఉంచడంతో అది తడిసి ముద్దయ్యింది. వర్షాలు తగ్గాక అయినా నీరు తగ్గకపోవడంతో ధాన్యాన్ని ఎక్కడ ఆరబెట్టుకోవాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు. సామూహిక కల్లాల ఏర్పాటులో ప్రభుత్వ నిర్లక్ష్యం తుపాను సందర్భంగా రైతుల పాలిట శాపంగా మారిందనడంలో అతిశయోక్తి లేదు.

తుపాను తర్వాత ప్రతి రైతునూ ఆదుకుంటాం.. అంటూ ఇటు అధికార పార్టీ ప్రజాప్రతినిధుల దగ్గర నుంచి అధికారుల వరకూ అంతా ఒకే పల్లవి అందుకున్నారు. ప్రధానంగా తడిసిన ధాన్యాన్ని నిబంధనలతో సంబంధం లేకుండా తమకు దగ్గర్లోని ఇష్టమొచ్చిన రైస్‌మిల్లుకు తరలించుకోవచ్చని ప్రకటనలు గుప్పించారు. వర్షాలు తగ్గాక తడిసిన ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేస్తున్నట్లు సైతం ప్రకటించారు. దీంతో రైతులు నీట మునిగిన ధాన్యాన్ని గట్టుకు చేర్చి హుటాహుటీన మాసూళ్లు పూర్తి చేసి అమ్మకానికి సిద్ధం చేశారు. అయితే అసలు కథ ఇక్కడే ప్రారంభమైంది. ప్రజాప్రతినిధులు, అధికారులవన్నీ ఉత్తుత్తి ప్రకటనలేనని, తడిసిన ధాన్యం కొనుగోలుకు ఆదేశాలే రాలేదని అటు ఆర్‌బికె అధికారులు, ఇటు మిల్లర్లు తేల్చేశారు. ఒకవేళ మిల్లుకు తీసుకెళ్లినా బస్తాకు ఎంతోకొంత సొమ్ము కోతగాని లేదా అదనపు ధాన్యంగాని తూయాల్సి వస్తుండటంతో రైతులు నివ్వెరపోయారు. అధికారులు సైతం అనధికారికంగా మిల్లర్లకే వత్తాసు పలుకుతుండటంతో రైతులు నోరుమెదపలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలిసిన రైతులు ఇన్ని కష్టాలూ పడి మిల్లర్ల వద్దకు వెళ్లి సొమ్ము కోసం వేచి ఉండటం ఎందుకని దళారులకే అమ్మడం ప్రారంభించారు. దీంతో ధాన్యం అమ్మకాల్లో ప్రభుత్వమే దళారులను ప్రోత్సహించినట్లయిందని రైతునేతలు చెబుతున్నారు. మరి నిబంధనలు సడలించామని ఊకదంపుడు ప్రకటనలు గుప్పించిన మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు దీనిపై నోరు మెదపకపోవడం అందరినీ విస్మయపరుస్తోంది.

ఇక భారీ వర్షాలు తగ్గి బుధవారం నుంచి కొంత పొడివాతావరణం నెలకొంది. గురువారం నుంచి ఎండలు ప్రారంభమయ్యాయి. అయితే డెల్టాలో డ్రెయిన్లను ఆనుకుని ఉన్న చేలల్లో నేటికీ ముంపు నీరు తగ్గకపోవడం, పంట కుళ్లిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. భారీ వర్షాలు మూడు రోజులే కురిసినా, అంతకుముందు వర్షాభావ పరిస్థితుల రీత్యా ముంపు నీరు డ్రెయిన్లలోకి పారడం పెద్దసమస్య కాదు. అయితే వైసిపి ప్రభుత్వం డెల్టా ఆధునికీకరణను అటకెక్కించి కనీసం డ్రెయిన్లలో పూడికతీత, గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు చేపట్టకపోవడంతో నీరు దిగువకు ప్రవహించని పరిస్థితి నెలకొంది. దీంతో రోజులు తరబడి పంట నీళ్లల్లో నాని కుళ్లి పనికి రాకుండాపోతుంది. ఇక బరకాలు అందించలేని పరిస్థితి స్పష్టంగా కన్పించింది. తుపానుకు ముందు గోనె సంచులు సైతం అందించలేని ఘటనలు తుపాను తర్వాత బయటపడ్డాయంటే అధికారుల పర్యవేక్షణలో లోపాలను ప్రతిబింబిస్తోంది.

ఇక రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఏలూరు జిల్లాలో శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. చావుకబురు చల్లగా చెప్పినట్లు మార్చి వరకూ సార్వా ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించారు. ధాన్యం కొనుగోలు చేస్తారనేది సానుకూల అంశమే. అయితే తక్షణం కొనుగోళ్లకు ప్రభుత్వం సిద్ధంగా లేదని ఆయన మాటలను బట్టి అర్థమవుతోంది. అంటే తడిసిన ధాన్యం, తేమ శాతం ఎక్కువున్న ధాన్యం ఆరబెట్టిన తర్వాతే కొనుగోలు చేస్తారనేది ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. దీన్నిబట్టి ప్రభుత్వం సార్వా ధాన్యం వెంటనే కొనుగోలు చేయకపోతే దాళ్వా సాగుకు పెట్టుబడులు ఎక్కడ నుంచి వస్తాయనేది అధికారులు, ప్రజాప్రతినిధులే చెప్పాలి. పరిహారం ఎంతిస్తారు, ఎప్పుడిస్తారనేదీ చెప్పరు.. ధాన్యం కొనుగోలు చేసి సొమ్ములివ్వరు అంటే దాళ్వా సాగు అటకెక్కినట్లేనని, ఒక విధంగా ప్రభుత్వమే అనధికారికంగా క్రాప్‌హాలిడే ప్రకటించేస్తున్నట్లు ఉందని రైతు నేతలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తడిసిన ధాన్యం కొనుగోలు దగ్గర నుంచి పరిహారం అందజేత వరకూ, అలాగే దాళ్వా సాగుకు విత్తనాల దగ్గర నుంచి అవసరమైన పెట్టుబడికి రుణ సదుపాయం వరకూ త్వరితగతిన చర్యలు చేపడితే రైతులకు ఉపయోగకరం. లేకపోతే వైసిపి, బిజెపి ప్రభుత్వాలు రైతు వ్యతిరేకతను మూటగట్టుకోక తప్పదని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

-విఎస్ఎస్వి.ప్రసాద్



తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న డిఆర్‌డిఎ పీడీ విజయరాజు

మొలకెత్తిన ధాన్యానికీ పరిహారం

ప్రజాశక్తి - భీమడోలు

ధాన్యం తడిసి మొలకొచ్చినప్పటికీ పంట నష్టం కింద నమోదుచేసి పరిహారం అందిస్తామని డిఆర్‌డిఎ పీడీ, ధాన్యం సేకరణ మండల ప్రత్యేకాధికారి ఆర్.విజయరాజు తెలిపారు. మండలంలో తుపానుకు దెబ్బతిన్న పంటలను, తడిసిన ధాన్యం రాశులను శనివారం పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. వివిధ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 13వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారని, 23 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ లక్ష్యంగా ప్రభుత్వ నిర్ణయించిందన్నారు. ఇప్పటి వరకూ పదివేల ఎకరాల్లో కోతల పూర్తయ్యాయని, 17వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి తరలించామని తెలిపారు. ఆరబెట్టిన 2700 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిపోయిందన్నారు. 1200 ఎకరాల్లో కోసిన వరి పైరుకు నష్టం వాటిల్లిందని తెలిపారు. తేమ శాతం 20 వరకూ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఈ మేరకు క్వింటాల్‌కు కేజీ చొప్పున కోత విధిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్న నేపథ్యంలో రెండు మూడు రోజుల్లో ధాన్యం సాధారణ కొనుగోలు స్థాయికి చేరుకుంటుందని తెలిపారు. మండలంలో తుపానుకు ముందుగానే అధికారుల సూచనతో అప్రమత్తమైన రైతులు కోతలను చేపట్టిన నేపథ్యంలో ధాన్యాన్ని ఇబ్బందిపడకుండా తరలించారని పేర్కొన్నారు. రైతులకు అవసరమైన ఏడు లక్షల గోనెసంచులను ముందుగానే సిద్ధం చేశామని తెలిపారు. ఎకరాకు మండలంలో 30 నుంచి 40 బస్తాల వరకూ ధాన్యం దిగబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, ఎంపిడిఒ సిహెచ్.పద్మావతి దేవి, వ్యవసాయాధికారి ఉషారాణి, విఆర్‌ఒ వెజ్జు వినయ్‌కుమార్, సచివాలయాల వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

11న నూజివీడులో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం(స్పందన) ఈనెల 11వ తేదీన నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, జెసి, ఇతర జిల్లాస్థాయి అధికారులు హాజరై అర్జీలు స్వీకరిస్తారన్నారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని డివిజనల్, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో యథావిధిగా స్పందన నిర్వహించబడుతుందన్నారు.

ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరి

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దెందులూరు మండలం సానిగూడెం గ్రామంలో మిచౌంగ్ తుపాన్ కారణంగా దెబ్బతిన్న వరి పంట పొలాలను, తడిసిన ధాన్యాన్ని దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి శనివారం పరిశీలించారు. రైతులు అధైర్య పడొద్దని, వైసిపి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, సొసైటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : పోలవరం నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లిందని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని బయన్నగూడెంలో దెబ్బతిన్న పంట పొలాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 50 వేల ఎకరాల్లో వివిధ రకాల పంట పొలాలు దెబ్బతిన్నాయన్నారు. పొగాకు రైతులు తుపాను వల్ల బాగా నష్టపోయారన్నారు.

పారిజాతగిరిలో యాత్రికుల రద్దీ

పారిజాత గిరిలో యాత్రికుల రద్దీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక గోకుల తిరుమల పారిజాత గిరి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని యాత్రికులు అధిక సంఖ్యలో సందర్శించారని ఆలయ కార్యనిర్వహణాధికారి మానికల రాంబాబు తెలిపారు. శనివారం ఆలయానికి వచ్చిన యాత్రికులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. పట్టణానికి చెందిన దాతలు కురుకూరు ఏడుకొండలు కుటుంబ సభ్యులు, వీర్ల సతీష్ కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారంతో అన్న ప్రసాద వితరణ నిర్వహించామని తెలిపారు. ఆలయ అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు సిబ్బంది పాల్గొన్నారని చెప్పారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుక

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కల్వరీ మినిస్ట్రీస్ కి చెందిన డి.మోజెస్ ప్రసాద్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. కార్యక్రమ అధ్యక్షులు ఆకుల శాస్త్రి మాట్లాడుతూ మండల ఫెలోషిప్ స్థాపించిన నుంచి క్రీస్తు సువార్తను ప్రకటించటమే కాకుండా ఆపదలో విపత్కర బాధితులకు పలు సేవా కార్యక్రమాలు అందిస్తున్నట్లు తెలిపారు.

రైతులు ఆందోళనచెందొద్దు

ప్రజాశక్తి - ఉంగుటూరు

తుపాను బాధిత రైతులు ఆందోళన చెందొద్దని, ప్రతిగింజనూ ఆర్‌బికేల ద్వారా కొనుగోలు చేస్తామని ఆర్‌డిఒ, మండల ప్రత్యేకాధికారి ఎన్ఎస్‌కె.ఖాజావలి తెలిపారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో శనివారం మండలంలోని కైకరం, తల్లాపురం, వివిధ గ్రామాల్లో పర్యటించి నీట మునిగిన వరి చేను, ధాన్యం రాశులను పరిశీలించారు. తుపాను వర్షానికి తడిసిన ధాన్యం తేమ శాతాన్నిబట్టి కొద్ది శాతం తగ్గింపుతో నిబంధనల మేరకు కొనుగోలు చేస్తారని చెప్పారు. బాగా తడిసిన ధాన్యం కూడా 25 నుండి 28 శాతం వరకూ నిబంధనల ప్రకారం తీసుకునేందుకు డ్రయర్ మిల్లులను సిద్ధంగా ఉంచామన్నారు. వర్షాలు ప్రారంభమైన తర్వాత ఐదో తేదీన 748 క్వింటాళ్లు, ఆరో తేదీ 5,718 క్వింటాళ్లు, ఏడో తేదీన 8,151 క్వింటాళ్లు, ఎనిమిదో తేదీన 10,599 క్వింటాళ్లు ఆర్‌బికేల ద్వారా కొనుగోలు చేశామని ఆర్‌డిఒ చెప్పారు. 4,156 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉందన్నారు. వాటికి సరిపడా సంచులు, రవాణాకు లారీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వీరివెంట తహశీల్దార్ రమణారావు ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆవేదన చెందుతున్న బాధితురాలు

దిబ్బగూడెంలో తాటాకిల్లు దగ్ధం

జీలుగుమిల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని దిబ్బగూడెం గ్రామంలో శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ముచ్చిక మంగరాజు కుటుంబంతో కలిసి పొలం పనుల నిమిత్తం వెళ్లారు. ఈ క్రమంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. కట్టు బట్టలతో మిగిలిన బాధితులు బోరున విలపిస్తున్నారు.

గుర్తు తెలీని మృతదేహం లభ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక రామచంద్రపురం రాముడి కుంట చెరువులో గుర్తు తెలీని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహం చెరువులో ఒడ్డుకు చేరిందని స్థానికులు పోలీసులకు సమచారం అందించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్, ట్రైనీ డిఎస్‌పి బి.విద్య సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తించాల్సి వస్తే తమను సంప్రదించాలని ఆమె తెలిపారు.

వరికోత యంత్రం దొంగల అరెస్టు

భీమడోలు: వరి కోత యంత్రం చోరీచేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు భీమడోలు సిఐ బిబి.రవికుమార్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతలపూడి మండలం అల్లిపల్లి గ్రామానికి చెందిన కొల్లూరు అశోక్ తనకున్న వరి కోత యంత్రాన్ని అద్దెకు తిప్పి జీవనం సాగించేవాడు. ఇటీవల వరికోత యంత్రానికి మరమ్మతులు ఎక్కువగా రావడంతో అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చేందుకు మరో వరి కోత యంత్రాన్ని దొంగలించాలని భావించాడు. ఈ మేరకు తన స్నేహితుడు కర్నాటి నవీన్ సహకారం కోరాడు. ఈ మేరకు వారిద్దరూ కలిసి వరి కోత యంత్రం కోసం భీమడోలుతో పాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారు. ఈ సందర్భంగా కురెళ్లగూడెంలో వరి కోత కోస్తున్న నెల్లూరుకు చెందిన షాకీర్ అహ్మద్ వరి కోత యంత్రాన్ని గుర్తించారు. ఈనెల ఒకటో తేదీ తెల్లవారుజామున మినీ వ్యాన్‌లో పొలంలో ఉన్న వరి కోత యంత్రాన్ని ఎక్కించుకొని ద్వారకాతిరుమల శివారులోని నిర్మానుష్య ప్రాంతంలో దాచారు. దీన్ని శనివారం వేరే ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో దొంగతనం విషయమై మమ్మురంగా దర్యాప్తు చేస్తున్న భీమడోలు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు ఇతర ప్రాంతాలకు తరలించడానికి సిద్ధంగా ఉన్న వరి కోత యంత్రాన్ని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

ప్రజాశక్తి - కైకలూరు

ఇరు పక్షాల కక్షిదారులకు లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ ఛైర్పన్ వివిఎన్.వి.లక్ష్మి సూచించారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా స్థానిక కోర్టు ప్రాంగణం వద్ద మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి లక్ష్మి మాట్లాడుతూ దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న కేసులను రాజీమార్గం ద్వారా న్యాయం చేయనున్నట్లు తెలిపారు. కక్షిదారులకు ఒకరిపై ఒకరు నమోదు చేసుకున్న కేసుల్లో రాజీ చేసుకునేందుకు లోక్ అదాలత్ సులువైన మార్గమన్నారు. రాజీ పడదగ్గ కేసుల్లో ఇరుపక్షాల కక్షిదారుల ఆమోదం మేరకే రాజీ చేయనున్నట్లు చెప్పారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ వ్యక్తిగత హక్కులను హరించే అధికారం ఎవరికి లేదన్నారు. ఒకరి హక్కును మరొకరు భంగం కలిగించే విధంగా వ్యవహరించకూడదన్నారు. బాలల నుంచి వృద్ధుల కోసం వ్యక్తిగత హక్కులు ఉంటాయని వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాడె వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ వివాద పరిష్కారానికి న్యాయవాదులు ఉచితంగా సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని చెప్పారు. రాజీమార్గం ద్వారా కక్షిదారుల విలువైన సమయం ధనం వృధా కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎంఎస్ఎస్.రాజు, కార్యదర్శి బి.లక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీ చావలి శంకరశాస్త్రి, అడిషనల్ పిపి శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

చింతలపూడి : ప్రతిఒక్కరూ హక్కులు విధులు తెలుసుకోవాలని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు తెలిపారు. చింతలపూడి పట్టణంలో కోర్టు లో జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో మొత్తం 667కేసులు రాజీ అయ్యాయి. సివిల్ కేసులు 9, రూపాయలు.1,77,1400, చెక్ బౌన్స్ కేసులు 07, రూపాయలు 3,90,000, డివిసి కేసు 01, రూపాయలు 5,00,000, క్రిమినల్ కేసులు 53,రూపాయలు 2,5,0000, బ్రాంది మరియు విస్కీ కేసులు 33 పరిహారంగా 220230, న్యూసెన్ పెట్టిన కేసులు 551 దానిలో ఫైన్ లు 250660 వసూలు చేసినట్లు తెలిపారు.టెలిఫోన్ బకాయి కేసులు 03 రాజీ చేసి రూపాయలు 3835 వసూలు చేసినట్లు తెలిపారు. అలాగే అధికారంనాడు జరుపుకొని మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రజలకు మానవ హక్కుల విలువ తెలియ చేశారు.ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సామయ్య, సర్కిల్ ఇన్స్పెక్టర్ యంవియస్ మల్లేశ్వర రావు , బెంచ్ మెంబెర్స్ యల్ వి చైతన్య, ఎండీ అక్బర్ అలీ పాల్గొన్నారు.

మరింత సమర్థవంతంగా 'మానవత' సేవలు

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ చేపడుతున్న సేవ, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు బాధ్యులందరూ సహకరించాలని శాఖ అధ్యక్షులు వట్టి సుగుణాకర్ కోరారు. శాఖ ఆధ్వర్యంలో భీమడోలులోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి శాఖ అధ్యక్షులు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇటీవల కాలంలో గుండె బైపాస్ సర్జరీ చేయించుకుని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న భీమడోలుకు చెందిన ఒక వ్యక్తికి మెరుగైన వైద్యం కోసం రూ.ఐదు వేల ఆర్థిక సాయం అందించారు. గుండుగొలను గ్రామానికి చెందిన వృద్ధురాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో శాఖ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, బియ్యం అందించారు. భీమడోలుకు చెందిన సాయిరాం క్లాత్ స్టోర్స్ దుస్తులను అందించారు. అదే గ్రామానికి చెందిన శాఖ సభ్యులు బర్ల రమణమూర్తి రూ.వెయ్యి, పూడి శ్రీనివాసరావు రూ.వెయ్యి అందించారు. దీంతోపాటు ప్రతిభ గల పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా నిధి నుంచి ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న భీమడోలుకు చెందిన హరి శంకర భవానీప్రసాద్‌కు రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. సదరు మొత్తాన్ని చెక్కు రూపంలో వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో శాఖ ఛైర్మన్ గుల్ల నూకరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.రాంబాబు, శాఖ కార్యదర్శి ఎ.శ్రీనివాసరావుతో పాటు భీమడోలు మానసా ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థికి మంజూరైన విద్యానిధి మొత్తాలను అందిస్తున్న మానవత సభ్యులు

రైతులకు పరిహారం చెల్లించండి

ప్రజాశక్తి - టి.నరసాపురం

తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులందరికీ నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం మండల కార్యదర్శి అనుమోలు మురళీ డిమాండ్ చేశారు. శనివారం విలేకరులతో మాట్లాడిన మురళీ మండలంలో మిచౌంగ్ తుపాను ధాటికి వందల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఎర్రకాలువ కింద సుమారు 350 ఎకరాల్లో వరి పంట పూర్తిగా పాడైందని, అలాగే మండలంలోని వేరుశనగ, మొక్కజొన్న, పొగాకు, పత్తి, అరటి పంటలు దెబ్బతిని రైతులు నష్టాలపాలయ్యారని, ప్రభుత్వం ప్రతిరైతునూ ఆదుకోవాలన్నారు పూర్తిస్థాయిలో పంట నష్టాలు జరిగిన పంటలను సర్వే చేసి రైతులకు పరిహారం అందించాలని, రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - భీమడోలు

ఓటు హక్కు నమోదుపై ప్రజలను చైతన్యపరిచేందుకు శనివారం భీమడోలుకు చెందిన మాధురి కళాశాల విద్యార్థుల భాగస్వామ్యంతో రంగోలి పోటీలు నిర్వహించినట్లు కరస్పాండెంట్ కె.ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఓటు హక్కు పట్ల అవగాహన కల్పించడం, ఓటర్లను చైతన్యపరచడం అంశాలుగా రంగోలి పోటీలు కొనసాగినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అశోక్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బాలు పాల్గొన్నారు.

5,6 తేదీల్లో ఎన్ఆర్ఐ టెక్నోఫెస్ట్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని ఎన్ఆర్ఐ కళాశాలల్లో ఏటా జనవరి 5,6 తేదీల్లో నిర్వహించే ఎన్ఆర్ఐ టెక్నోఫెస్టు జాతీయ సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం కళాశాలలో కళాశాల ఛైర్మన్ రావి వెంకట్రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు రాష్ట్ర నలుమూలల నుంచి ఇంజినీరింగ్, డిగ్రీ, ఎంబిఎ, ఎంసిఎ విద్యార్థులు హాజరై పోస్టర్, పేపర్ ప్రజంటేషన్లతో తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్, ప్రోగ్రాం కన్వీనర్ రావి సునీత, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఘనంగా సర్పంచి హసేన పుట్టినరోజు వేడుకలు



సర్పంచి హసేన దంపతులను సత్కరించిన గ్రామస్తులు, ప్రముఖులు

ప్రజాశక్తి - భీమడోలు

పొలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన పుట్టినరోజు వేడుకలు శనివారం ఆమె నివాసంలో ఘనంగా నిర్వహించారు. మండల స్థాయి అధికారులు, గ్రామపంచాయతీ, సచివాలయ సిబ్బంది, వైసిపి కార్యకర్తలు, ప్రముఖుల సమక్షంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రహీమా బేగం హసేన దంపతులను వారు సత్కరించారు. ఈ సందర్భంగా అందరికీ కృతజ్ఞతలు తెలియజేసిన సర్పంచి మాట్లాడుతూ ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు ఆశీస్సులతో, సహాయ సహకారాలతో గ్రామ పరిధిలో రూ.కోట్ల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. జగనన్న కాలనీల కోసం స్థలం సేకరించి వాటి పంపిణీ కార్యక్రమాలను పూర్తి చేశామన్నారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. రానున్న కాలంలో సైతం ఎంఎల్ఎ ఆశీస్సులతో గ్రామ పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది, అధికారులు, ప్రముఖుల సహాయ సహకారాలతో గ్రామాన్ని మరింత మరింతగా అభివృద్ధి చేసేందుకు, ముందుకు నడిపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

'నోటిఫికేషన్ల పేరుతో జగన్ మరో మోసం'

ప్రజాశక్తి - ముసునూరు

ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు గ్రూప్-1, గ్రూప్-2 నోటిఫికేషన్ల పేరుతో మరో కొత్త మోసానికి సిఎం జగన్ తెర లేపారని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరులో శనివారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరకు ఉద్యోగాల భర్తీని కూడా రాజకీయ ఎత్తుగడగా వాడుకుంటున్నారన్నారు. ఇష్టానుసారంగా నోటిఫికేషన్లు జారీ చేస్తూ నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడో 2021లో జాబ్ క్యాలెండర్ కింద ప్రకటించిన గ్రూపు-2 నోటిఫికేషన్‌ను రెండు ఇప్పుడు విడుదల చేశారన్నారు. కొన్నినెలల క్రితం ప్రకటించిన గ్రూపు-1 నోటిఫికేషన్‌ను ఇప్పుడు జారీ చేశారన్నారు. నోటిఫికేషన్ల ప్రకారం చూస్తే ఫిబ్రవరి 25న గ్రూప్-2 ప్రిలిమ్స్, మార్చి 17న గ్రూప్-1 ప్రిలిమ్స్ నిర్వహించనున్నారన్నాడు. ఈ రెండింటికీ మెయిన్స్ పరీక్షలను కొత్తగా ఏర్పడే ప్రభుత్వం హయాంలోనే నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరిలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ప్రిలిమ్స్ పరీక్షలు కూడా నిర్వహించేందుకు అవకాశం ఉండదన్నారు. నిరుద్యోగుల భవిష్యత్తును కూడా ఎన్నికల అస్త్రంగానే వాడుకుంటున్నారనారు. ఈ కార్యక్రమంలో కందుల పిచ్చయ్య, సర్పంచి కొండేటి విజయలక్ష్మి బాబి, ఉప సర్పంచి తోట శ్రీను, పార్టీ గ్రామ అధ్యక్షులు పాకనాటి ఆంజనేయులు, గారపాటి నరసింహారావు, గద్దల మోహన్‌రావు, సూర్యదేవర శ్రీనివాసరావు, మెదరమెట్ల సురేంద్ర, నక్క యోహాను, నలిబోయిన రాంబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి

ఎఐటియుసి జిల్లా మహాసభలో రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్

ఏలూరు టౌన్: కేంద్రలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రయివేటీకరణ విధానాలను తిప్పికొట్టాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. శనివారం ఎఐటియుసి జిల్లా ప్రథమ మహాసభ సిపిఐ జిల్లా కార్యాలయంలోని స్ఫూర్తి భవనంలో జరిగింది. తొలుత నగరంలోని ఆర్ఆర్‌పేటలోని శ్రీవెంకటేశ్వర స్వామి గుడి వద్ద నుండి ఎఐటియుసి సభా ప్రాంగణం వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం జిల్లా కార్యాలయం వద్ద ఎఐటియుసి పతాకాన్ని ఎఐటియుసి నగర అధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు ఆవిష్కరించారు. ఈ మహాసభకు ఆర్ఎస్.డాంగే, చాట్ల పుల్లారావు, కరీమ్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్ మాట్లాడుతూ కార్మిక వర్గ విముక్తి కోసం ఎఐటియుసి 104 సంవత్సరాల క్రితం ఏర్పడిందన్నారు. స్వాతంత్ర పోరాటంలో క్రియాశీలక పాత్ర పోషించిందని తెలిపారు. అన్ని రంగాల్లో కార్మిక సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం కృషిచేసి ఎర్రజెండాకు వన్నె తెచ్చిందన్నారు. పోరాటాల ద్వారా ఇఎస్ఐ, పిఎఫ్, పని భద్రత, కార్మిక విముక్తి చట్టం సాధించుకున్నామన్నారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తెచ్చి రైతులను నట్టేట ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ సంపదన అదానీకి దోచిపెడుతున్న మోడీని రాబోయే ఎన్నికల్లో గద్దె దింపాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి నాయకులు తమ్మా విశ్వేశ్వరరావు ఆలపించిన విప్లవ గేయాలు అలరించాయి. ఈ సభలో ఎఐటియుసి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు, జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, నగర అధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు, తోర్లపాటి బాబు, నగర కార్యదర్శి ఎ.అప్పలరాజు, పుప్పాల కన్నబాబు, కె.విగ్నేష్, భజంత్రీ శ్రీనివాసరావు, కంకిపాటి బుచ్చిబాబు, డిఎల్.మూర్తి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో పలుకేసులు రాజీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 139 సివిల్ కేసులు, 111 వాహన ప్రమాద బీమా కేసులను రాజీ చేశామని రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగకుమారి తెలిపారు. ఏలూరులోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌నుద్దేశించి ఆమె మాట్లాడారు. తద్వారా రూ.7 కోట్ల 37 లక్షల 35 వేలను పరిహారంగా చెల్లించామన్నారు. 1572 క్రిమినల్ కేసులు 135 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయని తలిపారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ ఛైర్పర్సన్ మేరీ గ్రేస్ కుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బులికృష్ణ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: లోక్‌అదాలత్ ద్వారా కేసులను సత్వరం పరిష్కరించుకోవచ్చని ఎస్ఐ ఎన్.చంటిబాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో మండలం నుండి పేకాటరాయుళ్ల 42మంది వద్ద నుంచి రూ.32వేలు నగదును సీజ్ చేసి, రూ.12,600 అపరాధ రుసుము, డ్రంక్ అండ్ డ్రైవ్ వ్యక్తులపై రూ.70 వేలు, బహిరంగ మద్యపానం, ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించిన వారికి రూ.35,500, అతివేగంగా వాహనాలు నడిపిన వారికి రూ.3,900, అక్రమ లిక్కరు షాప్‌ల యజమానులకు రూ.30వేలు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. అలాగే మండల పరిధిలో 20 కేసులను రాజీ చేసినట్లుగా తెలిపారు.

విద్యార్థులకు తాగునీరు

చింతలపూడి: చింతలపూడి అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల తాగునీటి ఇబ్బందులకు టిడిపి నేతలు స్పందించారు. ఆ పార్టీ ఎస్‌సి సెల్ నాయకులు ఎస్.నాగేశ్వరావు సురక్షిత నీటిని అందించారు. పాఠశాల సిబ్బంది విజ్ఞప్తిమేరకు నియోజకవర్గ టిడిపి మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డి ఆదేశాల మేరకు, రెండు వేల లీటర్ల మినరల్ వాటర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు, తాళం చెన్నా, తాళం రాఘవ పాల్గొన్నారు.

17 నుంచి షష్టి ఉత్సవాలు

ముదినేపల్లి: మండలంలోని శింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో జరగనున్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్టి కళ్యాణ మహోత్సవాలను విజయవంతం చేయాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు కోరారు. శనివారం ఆలయ ప్రాంగణంలో వార్షిక షష్టి మహోత్సవాల సందర్భంగా ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.కాజావలి అధ్యక్షతన జరిగిన కో-ఆర్డినేషన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డిఎన్ఆర్ మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ జరగనున్న స్వామివారి షష్టి ఉత్సవాలను వివిధ శాఖల అధికారులు, షష్టి ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నేల సంధ్య, జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి సిహెచ్.రంగారావు, ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ తహశీల్దార్ కె.శ్రీనివాస్, ఎంపిడిఒ పి.మల్లేశ్వరి పాల్గొన్నారు.

కార్తీక వన సమారాధనలో ఎంఎల్ఎ దూలం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని గురజలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం జరిగిన కార్తీక వన సమారాధనలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పాల్గొన్నారు. తొలుత ఆయన స్వామి వారిని దర్శించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, ఆలయ ఛైర్మన్ మీసాల రామకృష్ణ, వైసిపి నాయకులు బత్తిన కిషోర్, రంగిశెట్టి నరసింహారావు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి అద్దయ్య

ఓట్ల జాబితా సక్రమంగా ఉండాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఓట్ల జాబితా సక్రమంగా ఉండాలని పలు పార్టీల నాయకులు కోరారు. బుట్టాయగూడెం తహశీల్దార్ కార్యాలయంలో టిడిపి, వైసిపి నాయకులతోపాటు పలు పార్టీలకు చెందిన నాయకులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.అద్దయ్య శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీల నాయకులు మాట్లాడుతూ ఓట్ల జాబితా సక్రమంగా ఉండాలని, డబుల్ ఎంట్రీలు తొలగించాలని, కొత్త ఓట్లు పెట్టుకున్న ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటర్ లిస్ట్‌లో ఎటువంటి జంబ్లింగ్ లేకుండా సీరియల్‌గా ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఎస్ఎస్.శాంతి, కొయ్యలగూడెం, పోలవరం తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘనంగా సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

యుపిఎ చైర్‌పర్సన్ సోనియా గాంధీ పుట్టినరోజు వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు జెట్టి గురునాధరావు కార్యాలయం వద్ద రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దాల ప్రసాద్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు హీరా హకీమ్ కేక్ కట్ చేశారు. యుపిఎ చైర్‌పర్సన్‌గా సోనియా గాంధీ దేశ అభివృద్ధికి అనేక సూచనలు, సలహాలు, చట్టాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వీరవల్లి సోమేశ్వరరావు, మొగలినీడి శ్యామ్, జీడిగంటి రామారావు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

RAMANI SRIDEVI అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.15-02-2017న P7891499 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరుచేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.30-11-2023 న కాళీపట్నం పడమర గ్రామం నుండి నరసాపురం పట్టణంకు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతు న్నాను.

RAMANI SRIDEVI
W/o. Ramani srinu
D.No. 1-24, Pallipalem, Kalipatnam West,
Mogaltur Mandal, West Godavari Dist, A.P.

దస్తావేజు పోయినది

పులిగడ్డ రాంబాబు, తండ్రి: రంగారావు గల నా యొక్క దస్తావేజు పోయినది. పెనుగొండ ఇంటి నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళుతుండగా నా యొక్క దస్తావేజు పడిపోయినది. **దస్తావేజు నెంబర్ 2474/2001** గల దస్తావేజు ఎవరికైన దొరికిన యెడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

<u>అడ్రస్:</u> పులిగెడ్డ రాంబాబు
తండ్రి: రంగారావు
పెనుగొండ, పెనుగొండ మండలం
పశ్చిమగోదావరి జిల్లా, పిన్: 534320
సెల్: 9494762684

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, తణుకు

O.S. 442/2020

Between:

విజయ బ్యాంక్, ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా, Rep. by its మేనేజర్, తణుకు. -వాది

మరియు

1. తోలేటి పెద నరసింహారావు, S/o. వెంకట్రాయ్య, డో.నెం. 22-5-105, బంగారు చెరువు గట్టు, పాలకొల్లు.
2. తోలేటి మంగతాయారు, W/o. పెద నరసింహారావు, డో.నెం. 22-5-105, బంగారు చెరువు గట్టు, పాలకొల్లు.
3. వేముల అశ్వనికుమార్, S/o. భాస్కరరావు, శ్రీనగర్ కాలనీ, పాలకొల్లు. -ప్రతివాదులు

ప్రకటన

పై నెంబరు గ్రంధములో ప్రతివాదులన మీ ముగ్గురికి ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికిన్నీ అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు Substituted Service by way of Paper Publication ఉత్తర్వులు వేసియున్నారు. పై నెంబరు గ్రంధము **ది. 12-12-2023వ తేదీకి వాయిదా అయివున్నది.** కావున మీరు ముగ్గురు సదరు తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట **ఉదయం 10 గం|| 30 ని||లకు** స్వయముగా గాని, లేక మీ యొక్క ప్లీడరు గారి ద్వారా హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)

తణుకు
08-12-23

ఓ.ఎన్.కృష్ణ, అడ్వకేట్
తణుకు, సెల్:9848199440

NUZVID MUNICIPALITY

Sl. No.	Name of Work
1	Nuzvid Municipality would like to appoint 3rd party Quality assurance agency for conduction quality control tests for works. Sale of Tender schedule start date - Dt. 11-12-2023 Last date for Submission Dt. 14-12-2023 Opening of Technical bid - Dt. 14-12-2023 Cost of Tender Schedule - Rs. 1000/- The Commissioner, Nuzvid Municipality reserves all rights to cancel/ reject/ postpone/ fixup any special conditions.

Sd/- **COMMISSIONER**
Nuzvid Municipality